# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన గుంటూరు జిల్లా వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జనవరి రెండవ తేదీన మంత్రివర్గ సమావేశం జరగనుంది.**

**2. ఈ నెల 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 45 వేల 94 పాఠశాలల్లో 'తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు' నిర్వహించడంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు.**

**3. తిరుమలలో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దీనిలో భాగంగా అనేక చర్యలు చేపట్టామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు.**

**4. విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష విరమణలు రెండో రోజూ కొనసాగుతున్నాయి. భవానీ దీక్షాధారులు పెద్ద సంఖ్యలో కాలినడకన తరలివస్తున్నారు.**

**5. గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన గుంటూరు జిల్లా వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జనవరి రెండవ తేదీన మంత్రివర్గ సమావేశం జరగనుంది. సమావేశంలో చర్చించాల్సిన అంశాల్ని నిర్దేశిత నమూనాలో అందజేయాలని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

--------------------------

ఈ నెల 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 45 వేల 94 పాఠశాలల్లో 'తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు' నిర్వహించడంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆయన ప్రత్యేకంగా లేఖ రాశారు. విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమాల గురించి స్థానిక పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ఇటీవల కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో రాష్ట్రంలో జరిగిన సమావేశాల వివరాలు తెలుసుకున్న ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్యమంత్రికి లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా భారీస్థాయిలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాధించిన విశేషమైన విజయాన్ని అభినందిస్తున్నానని

లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తుందని.. ఈ ప్రయత్నం ఇతర రాష్ట్రాలూ అనుసరించడానికి ఒక నమూనాగా ఉంటుందని కేంద్రమంత్రి అభినందించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులను నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి ఆదేశించారు. నెల్లూరులో నిన్న జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని, వాటిని ప్రజలకు చేరువ చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహించమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తనకు సూచించారని ప్రభాకర రెడ్డి తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ఎన్టీఆర్ జిల్లాలోని ప్రతి ఇంటా సూర్యఘర్‌తో ఆర్థిక స్వావలంబన వెలుగులు నిండాలని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని భావితరాలకు ఆరోగ్యకర పర్యావరణాన్ని వారసత్వ సంపదగా అందిద్దామని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలకు పీఎం సూర్యఘర్ పథకంపై నిన్న అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ సూర్యఘర్ పథకం ద్వారా అధిక రాయితీతో చాలా తక్కువ పెట్టుబడితో ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందవచ్చని తెలిపారు. దీనివల్ల కుటుంబాలకు ఆర్థికంగా చేయూత లభించడంతో పాటు పర్యావరణ సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చని లక్ష్మీశ వివరిస్తూ..

...వాయిస్...34 సెకన్లు...

---------------------------

తిరుమలలో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దీనిలో భాగంగా అనేక చర్యలు చేపట్టామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తిరుమల పవిత్రతను కాపాడే విధంగా ప్రతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. అన్నప్రసాదాలు, లడ్డూ నాణ్యత పెంచామని, క్యూ లైన్లలో వేచి ఉండే సమయం తగ్గించామని తెలిపారు. తిరుమలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపామని.. 2047 తిరుమల విజన్‌లో భాగంగా అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేశామని శ్యామలరావు వెల్లడించారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష విరమణలు రెండో రోజూ కొనసాగుతున్నాయి. ఆదివారం కావడంతో భవానీ దీక్షాధారులు పెద్ద సంఖ్యలో కాలినడకన తరలివస్తున్నారు. కాగా.. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భవానీ దీక్షల విరమణల కార్యక్రమం నిన్న ప్రారంభమైంది. ఈ నెల 25వ తేదీ వరకు దీక్షల విరమణలు కొనసాగనున్నాయి. దుర్గామల్లేశ్వర దేవస్థానం, జిల్లా యంత్రాంగం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శీఘ్ర దర్శనం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. దీనిలో భాగంగా రుసుము ద్వారా దర్శనం, ఆర్జిత సేవలను ఈ నెల 25వ తేదీ వరకు రద్దు చేశారు.

---------------------------

సమర్ధవంతమైన పాలన, సేవలను ప్రజలకు అందించడమే సుపరిపాలన కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈరోజు ఆయన విజయవాడలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రశాసన్ గావ్‌కి ఒరే -2024లో భాగంగా.. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో సుపరిపాలన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పారదర్శకత, జవాబుదారీతనం, సహకార స్ఫూర్తిని పెంపొందించడం ద్వారా ప్రజలు తమ సమస్యలను అధికారులకు అందించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని కలెక్టర్ వివరిస్తూ..

వాయిస్ (32 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో 22.63 శాతం అడవులు ఉన్నాయని కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది. దేశంలో గత రెండేళ్లుగా అటవీ విస్తీర్ణం, సంబంధింత ఇతర అంశాలపై 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్టు రిపోర్టు..ఐఎస్ఎఫ్ఆర్-2023' పేరుతో కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ నిన్న నివేదిక విడుదల చేశారు. దీని ప్రకారం, రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 30 వేల 84.96 చదరపు కిలోమీటర్లు ఉంది. అత్యధిక సాంద్రత ఉన్న అడవి వెయ్యి 995.71 చదరపు కిలోమీటర్లు, మధ్యస్థ సాంద్రత ఉన్న అడవి 13 వేల 725.75 చదరపు కిలోమీటర్లు, బహిరంగ అడవి 14 వేల 363.50 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి.

---------------------------

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన భారతీయ గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి ఈరోజు. ఈ సందర్భంగా గణిత శాస్త్రానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. 1887 డిసెంబర్ 22వ తేదీన తమిళనాడులోని ఈరోడ్‌లో జన్మించిన శ్రీనివాస రామానుజన్ చిన్న వయసులోనే గణిత శాస్త్రంలో అసాధారణ ప్రతిభ చూపి, ఎంతో విలువైన సిద్ధాంతాలను ప్రతిపాదించారు.

గణిత శాస్త్రానికి శ్రీనివాస రామానుజన్ అందించిన సేవలకు గుర్తింపుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 22వ తేదీని జాతీయ గణిత దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆయన పేరుతో ఒక తపాలా బిళ్ళను కూడా విడుదల చేసింది.

---------------------------

గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ జయంతి వేడుకలు తిరుపతిలో ఘనంగా జరిగాయి. నగరంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో పలువురు ప్రముఖులు, ఛార్టెడ్ అకౌంటెంట్స్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా  నివాళులు అర్పించారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర అల్పపీడనంగా బలహీనపడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. అల్పపీడనం ప్రభావంతో రేపటి వరకు తీరం వెంబడి గంటకు గరిష్ఠంగా 55 కిలోమీటర్ల  వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, రాబోయే 3 రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేసింది.

=====================